ముంచుతున్న వర్షం



పెద్దకడబూరు వద్ద పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు



వర్షానికి తడిసి నల్లగా మారిన వేరుశనగ పంట

- డివిజన్ పరిధిలో భారీ వర్షం
- నీట మునిగిన పంట పొలాలు
- కుదేలవుతున్న రైతులు

పెద్దకడబూరు : అయితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నట్టుగా ఉంది వర్షాల పరిస్థితి. 10 రోజుల క్రితం వరకు రైతులు, ప్రజలు వర్షం కోసం మొక్కని మొక్కు లేదు.. చేయని పూజలేదు. వేసిన పంటలు ఎండలకు మాడిపోయాయి. ప్రతి రైతు రోజూ ఆకాశంవైపు ఆశగా చూస్తూ ఉండిపోయాడు. కనికరించిన వరుణుడు కురిసేలోపు రైతులు కొంచెం ఊపిరి పీల్చుకున్నారు. నాలుగు రోజులు కురిసేలోపు రైతులు సంతోషంతో పులకించిపోయారు. అయితే ఆ తరువాత రోజూ వర్షం పడసాగింది. శుక్రవారం ఏకంగా మండలంలో 35.4 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. శనివారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో రైతుల అరకొరగా ఉన్న పంటలు కూడా వర్షపు నీటితో మునిగిపోతున్నాయి. బోరు బావుల కింద చేతికొచ్చిన పత్తి వర్షాలకు కాయ నల్లబడి నేలరాలిపోతోంది. దీంతో రైతు అతివృష్టితో కుంగిపోతున్నాడు. ఇక్కడితో వర్షాలు ఆగిపోతే చాలు అని రైతులు ఆదే వరుణదేవున్ని వేడుకుంటున్నారు. లేకపోతే పంటలు మొత్తం నాశనం అయ్యి అన్నదాత రోడ్డున పడేపరిస్థితి లేకపోలేదు.



చేతికి వచ్చిన కొర్రపంట వర్షానికి నేలకొరిగిన దృశ్యం

గోనెగండ్ల : గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం కురిసిన వర్షానికి గోనెగండ్ల, గంజిహళ్లి, ఐరన్‌బండ తదితర గ్రామాల్లో పత్తి పొలాల్లో వర్షం నీరు నిలిచింది. దీంతో పత్తి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గంజిహళ్లి గ్రామానికి చెందిన వలి, ఐరన్‌బండ కు చెందిన హుసేన్ పొలాల్లో వర్షం నీరు నిలిచింది. మండలంలో గత రెండు రోజులుగా మోస్తరు కురుస్తుంది. దీంతో పత్తి, ఉల్లి, వేరుశనగ పంటలు తడిసిపోయి రైతులకు నష్టం వాటిల్లుతోంది. అలాగే వర్షం కురువడంతో పత్తి పంట పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో పంట కుళ్లిపోవడమే గాక వైరస్ సోకడంతో ఆకులు పసుపచ్చగా మరిపోతున్నాయి. కాయలు రాలిపోవడమే గాక పూత సైతం రాలిపోతుందని రైతులు వాపోతున్నారు. అలాగే ఉల్లి పంటకు నీరు ఎక్కువగా కావడంతో మజ్జిగ తెగులు సోకిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బురదలోనే విద్యార్థులకు భోజనం



భోజనాల కోసం లైన్‌లో నిలబడిన విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు బురదలోనే మధ్యాహ్న భోజనం వడ్డించారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల అవరణలో వర్షపు నీరు నిల్వ ఉండి బురదమయంగా మారింది. విద్యార్థులకు ప్రతి రోడూ వంటగది దగ్గరే భోజనం వడ్డించే రీతిగానే వర్షం కురిసినా కూడా అలాగే వడ్డించడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షకాలంలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు అనువైన స్థలాన్ని ఎంపిక చేసి అక్కడ భోజనాలు వడ్డించే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు పేర్కొన్నారు. ఈ విషయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణా రెడ్డిని వివరణ కోరగా వర్షాలకు పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఏర్పడి బురదమయంగా మారింది. అయితే అక్కడ భోజనాలను వడ్డించుకుని వచ్చి పాఠశాలలోనే విద్యార్థులు భోజనం చేస్తారని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



భోజనం పెట్టించుకుని వస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శనిదోష పరిహార పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్: శనిత్రయోదశి సందర్భంగా శనివారం మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనిదోష పరిహార పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ మేనేజర్ కొమ్రేష్ ఆధ్వర్యంలో వేద పండితులు గురురాజా ఆచారి, అక్షయ్‌ల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదులవారి ఆదేశాల మేరకు ఈ ఏడాది అర్ధాష్టమ, అష్టమ, ఏలినాటి శని, శనిదోషములతో కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలు అనుభవిస్తున్న కర్కాటక, మీన, వృశ్చిక, మకరరాశుల వారితో వేద పండితులు దోష పరిహార పూజలు జరిపించారు. ముందుగా మంగరాయ ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన నువ్వులనూనెతో శనీశ్వరస్వామికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సేవలు గుర్తుండిపోతాయి



పదవీ విరమణ పొందిన ఏఓను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు : ఉద్యోగులు పదవీ విరమణ సర్వసాధారణమని, అయితే ప్రజలకు వారు చేసిన సేవలే ఎప్పటికీ గుర్తుండి పోతాయని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభాకర్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కౌతాళం: ప్రతి పోటీలో క్రీడా స్ఫూర్తిని చాటాలని బదినేహాల్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు అన్నారు. శనివారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, వ్యాయమ ఉపాధ్యాయుడిని సన్మానించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ కర్నూలు వారు ఇటీవల అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బాల బాలికల ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో బదినేహాల్ జిల్లా పరిషత్ కన్నడ పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఎంపీ చేతులు మీదుగా వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహారాజు విన్నర్ ట్రోఫీని అందుకోవడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధప్ప, ఈరన్న, శశిధర్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడి మృతి



వడ్ల రంగస్వామి (ఫైల్)

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన సీనియర్ పాత్రికేయుడు వడ్ల రంగస్వామి(80) శనివారం ఉదయం మృతి చెందాడు. 20 ఏళ్లు ఓ ప్రముఖ దినపత్రిక విలేకరిగా పని చేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మండల ఏపీయూడబ్ల్యూజే నాయకులు, వివిధ పార్టీల నాయకులు రంగస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పింఛన్ల పంపిణీ



గణేష్ సర్కిల్‌లో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

ఆదోని టౌన్: పట్టణంలో శనివారం ఉదయం 6 గంటలకే ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమయ్యింది. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో సచివాలయం, మున్సిపల్ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు. సాయంత్రం 5.30 గంటల సమయానికి 95.20 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యిందని ఎమ్మెల్యే తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- డివిజన్ కేంద్రంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఆదోని ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ సి.విశ్వనాథ్

ఆదోని రూరల్: ఆదోని డివిజన్ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ సి.విశ్వనాథ్ సూచించారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకమైన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రజలు ఫోన్ నంబర్ 8333989012కు కాల్ చేసి సమస్య తెలియజేయవచ్చన్నారు. డివిజన్‌లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్, రహదారులు-భవనాలు తదితరశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అధికారులు గ్రామస్థాయిలో ఉండే వీఆర్ఏ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి అవసరమైన సమయాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్‌లు గ్రామాలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. వాగులు, వంకల వద్ద ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

అప్పు మాఫీ కోసం డబ్బు తీసుకున్నానన్నది అవాస్తవం



టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ యుకె రాజశేఖర్

ఎమ్మిగనూరుటౌన్: టౌన్‌బ్యాంక్‌లో తీసుకున్న అప్పును వన్‌టైం సెటిల్‌మెంట్ కింద మాఫీ చేయించేందుకు తాను డబ్బు తీసుకొని.. మాఫీ చేయలేదని సూగూరు నాగేష్ అనే వ్యక్తి తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ యూకే రాజశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూగూరు బోయ నాగేష్ అనే వ్యక్తి టౌన్‌బ్యాంక్‌లో 1996లో రూ.75వేలు రుణం తీసుకున్నాడని తెలిపారు.1998లో బ్యాంక్ అధికారులు అప్పును వడ్డీతో కలిసి రూ.1,34,541లు చెల్లించాలని నోటీసులు ఇచ్చారన్నారు. ఆ అప్పు చెల్లించకపోవడంతో ఈనెల 31వ తేదీకి వడ్డీతో రూ.7.76లక్షలకు పైగా చేరుకున్నట్లు బ్యాంక్ అధికారుల లెక్కలున్నాయన్నారు. అయితే వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా అప్పు చెల్లిస్తానని గతంలో తన వద్దకు వస్తే బ్యాంక్ అధికారులను కలవమని చెప్పానన్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం లేదని మొత్తం చెల్లించాలని అప్పుడే అధికారులు సైతం చెప్పారని తెలిపారు. అయితే అప్పు మాఫీ చేయించేందుకు తనకు ఒక వ్యక్తిద్వారా రూ.2.80లక్షలు ఇచ్చినట్లు ఆరోపించడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అప్పు మాఫీకి డబ్బు తీసుకునేందుకు తాను ఏ వ్యక్తిని పురమాయించలేదని, బ్యాంక్ ఆదేశాలతోనే వన్‌టైం సెటిల్‌మెంట్ అధికారులు చేస్తారేకాని తనకు, ఆ అధికారం లేదని, తాను ఎలా సెటిల్‌మెంట్ చేస్తానని ప్రశ్నించారు. ఎవరో ఒకరి ప్రోద్బలంతో తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. తనపై ఆరోపణలు చేసిన వ్యక్తిపై పరువునష్టం దావా కూడా వేస్తానని తెలిపారు.

స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ



పిల్లలకు మందును వేస్తున్న అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషన్ అసోసియేషన్ (అవోపా), వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామివారి ఆశీస్సులతో స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో రోగనిరోధక స్వర్ణామృత ప్రాసనం మందులు 389 మంది చిన్నారులకు పంపిణీ చేసినట్లు అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. పిల్లలకు ఈ మందు రోగనిరోధక శక్తి పెంచడానికి, మేధాశక్తిని, ఆయుష్షును, చర్మ సౌందర్యాన్ని, మానసిక ఎదుగుదలను పెంచడానికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా, వామ్ కార్యదర్శులు రఘు, ఈరన్నశెట్టి, వెంకటేశ్వర్లు, సభ్యులు ప్రసాద్‌రావు, రాజేష్, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, సంగీత, సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు

కోసిగి : శ్రావణ మాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని హనుమాన్‌కు ప్రత్యేక పూజలు గావించారు. మండల కేంద్రంలోని కడపాళెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు శ్రీరాములు ఆధ్వర్యంలో వేకువ జాము నుంచే పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీపీ ఈరన్న, ఉరకుంద ట్రస్టు బోర్డు సభ్యుడు నరసింహులు స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు.



స్వామివారి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు

వైభవంగా రణమండల ఆంజనేయ స్వామి రథోత్సవం





అశేష భక్తజనం మధ్య రథోత్సవం, (ఇన్‌సెట్)ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి మంగళహారతి ఇస్తున్న ఆలయ పూజారులు

ఆదోని అర్బన్: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా రణమండల ఆంజనేయస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా రథానికి ఎమ్మెల్యే పార్థసారథి, ఆలయ నిర్వాహకులు టి.జి.పాండురంగయ్యశెట్టి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, నాయకులు మల్లప్పతో పాటు భక్తులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. అర్ధగేరి సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం కోట్ల కూడలి పాత బస్టాండు వరకు వెళ్లి తిరిగి సాయిబాబా ఆలయానికి చేరుకుంది. తెల్లవారు జామున రణమండలకొండలో ఆంజనేయస్వామి వారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, వివిధ రకాల పూల అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ముఖద్వార నిర్మాణానికి భూమిపూజ

పట్టణశివారు రణమండలకొండకు వెళ్లే రహదారిలో ముఖద్వారం ఏర్పాటు చేసేందుకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి శనివారం భూమిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే రణమండల ఆంజనేయస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదోని అభివృద్ధే లక్ష్యం

- ప్రజాసమస్యల పరిష్కారంలో సహాయ సహకారాలు అందిస్తాం
- మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ బోయశాంత, పాలకవర్గ సభ్యులు
- ఆక్రమణల తొలగింపుపై అధికారులు, కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



అధికారులతో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

ఆదోని టౌన్: పార్టీలకు అతీతంగా ఆదోనిని అభివృద్ధి చేసుకుందామని, ప్రజా సంక్షేమమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, పాలకవర్గ సభ్యులు ముక్తకంఠంతో అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో చైర్‌పర్సన్ బోయశాంత అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు సందీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్, రాజేశ్వర్‌రెడ్డి, చలపతి, సురేష్ మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. 16వ వార్డు కౌడల్‌పేటలో అభివృద్ధి చేయాలని ఆ వార్డు మహిళా కౌన్సిలర్ చైర్‌పర్సన్ పోడియం వద్ద కూర్చొని నిరసన తెలియజేస్తుండగా తోటి కౌన్సిలర్లు ఆమెకు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితుల్లో ఉన్నామని కౌన్సిలర్లు ఉమామహేశ్వరి, మహేశ్వరి, ఎస్.పి.లక్ష్మిదేవి, పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో అక్రమ కట్టడాల కూల్చివేతలో నిర్లక్ష్యం జరుగుతుందని, కాలువలపై ఉన్న బండలు మాత్రమే తొలగిస్తే అభివృద్ధి అవుతుందా అంటూ కౌన్సిలర్లు టీపీఓను ప్రశ్నించారు. అక్రమ కట్టడాల కూల్చివేత సమాచారం కౌన్సిలర్లకు ఎందుకు తెలియజేయడంలేదని నిలదీశారు. ఈ సందర్భంగా అధికారులు, కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఇకమీదట వార్డుల్లో ఏం జరిగినా తమకు సమాచారం తప్పకుండా ఇవ్వాలని, లేనిపక్షంలో కౌన్సిల్‌ను బహిష్కరించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. పట్టణంలో వీధి కుక్కలను పట్టుకోవాలని, రోడ్లపై సంచరించే ఆవులను బంధించి గోశాలకు తరలించాలని అనేకమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడేలేడని కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. తడిపాడి చెత్తపై వాగ్వాదం జరిగింది. ఖాజీగడ్డపై పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ ఫయాజ్ అధికారులను డిమాండ్ చేశారు. తడిపొడి చెత్తపై పన్ను రద్దు చేయాలని, ఖాజీగడ్డపై రెక్కాడితేగానీ డొక్కాడని పేదలేనని, పన్నులు చెల్లించే స్థితిలో లేరన్నారు.

ఆదోనిలో బ్యానర్ల సంస్కృతి మంచిది కాదు

సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన ఆదోనిలో బ్యానర్ల ఏర్పాటు మంచిది కాదని పాలకవర్గ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ఫయాజ్, రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి భవంతులు నిర్మించడం న్యాయమా అంటూ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై పాలకవర్గ సభ్యులు, ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం జరిగింది. ఎన్‌జీవోస్ హోంను ఎర్రిస్వామి అనే వ్యక్తి 99 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నారని, ఆయన వద్ద నుంచి ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని భవంతిని నిర్మించడం జరిగిందని కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. స్థలం లీజు విషయంలో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధంలేదని, అనవసరంగా పార్టీ పేరును తీసుకొస్తూ అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నాలు చేయడం భావ్యం కాదన్నారు. భవనానికి సంబంధించి ఏదేని సమస్య ఉన్నా ఎర్రిస్వామితో చర్చించాలే తప్పా పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం

ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పూలమాల వేసి దుశ్శాలువాతో సన్మానించారు. అలాగే వైస్ చైర్మన్లు నరసింహులు, గౌస్, కౌన్సిలర్లు పూలమాలలతో సన్మానం చేశారు. పట్టణ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ మధుసూదన్ తెలిపారు.

ఎమ్మిగనూరు డిపోకు కొత్త బస్సులు



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు బస్సులను శనివారం డిపో ఆవరణలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం బస్సును నడిపి సిబ్బందిని ఉత్సాహపరిచారు. ఇందులో ఒకటి శ్రీశైలం బస్సు సర్వీసు కాగా మరొకటి బెంగళూరుకు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ అమర్నాథ్ తెలిపారు. ఆదేవిధంగా పట్టణంలోని 14వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు



సీఈఓ గంగాధర్‌ను సన్మానిస్తున్న మాజీ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్

ఎమ్మిగనూరుటౌన్: బ్యాంకుల్లో ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తేనే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్లు యూకే రాజశేఖర్, బీఎస్ నాగరాజు, ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ అన్నారు. స్థానిక టౌన్‌బ్యాంక్‌లో సీఈఓగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన గంగాధర్‌కు శనివారం బ్యాంక్‌లో మాజీ పాలకవర్గ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ సీఈఓగా గంగాధర్ బ్యాంక్ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. సీఈఓ గంగాధర్ మాట్లాడుతూ బ్యాంక్ గత పాలకవర్గ చైర్మన్ యూకే రాజశేఖర్ సహకారంతో అధిక లాభాలతో పాటు డిపాజిట్లు సాధించిందన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్లు తట్టె బుడ్డప్ప, మాధవులు, మనియార్ వాహిద్, వడ్డె రంగన్న, రజాక్, శ్రీరాములు, మహదేవప్ప, బ్యాంక్ ఆడిటర్ తురాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

ఆదోని అర్బన్: నియోజకవర్గంలో గణేష్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐలు శ్రీరామ్, సూర్యమోహన్ రావు, రామలింగప్ప సూచించారు. శనివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవసమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత చేపడుతున్నామని, మండప నిర్వాహకులు సహకరించాలన్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో ఎన్ని గణేష్ మండపాలు నిర్వహిస్తారో, ప్రతిఒక్కరూ ఆయా స్టేషన్ పరిధిలో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కునిగిరి నీలకంఠ, మారుతిరావు, దిలీప్‌దోకా, శ్రీకాంత్‌రెడ్డి, హెగ్గటి ప్రతాప్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయాలి

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామంలోని విధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగప్ప డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో అలువాల గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అలువాల గ్రామంలో ఆయా కాలనీల్లో గత 30 సంవత్సరాల క్రితం సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేశారు. అయితే అవి వేసిన రెండు, మూడు సంవత్సరాలకే పాడై పోయాయన్నారు. వీరేష్, ఈరన్న, నాగేష్, దుబ్బన్న, వెంకటేష్, రంగన్న పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాలి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించాలని కోరుతూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ గత 30సంవత్సరాల క్రితం నిర్మించిన ట్యాంకు నీళ్లు ప్రస్తుత జనాభాకుప మాత్రము సరిపోవడం లేదన్నారు. ఉలిగయ్య, చాంద్‌బాషా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జంగమహేశ్వరులకు పథకాలు అందేలా చూడాలి

ఆదోని అర్బన్: జంగమ మహేశ్వరులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అల్కూరు మఠం మహర్షి వాణి విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం కర్నూలులో ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి సమస్యలను విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దేవాలయాల ధూపదీప నైవేద్య పథకం, ఇతర పథకాలు ఇంకా అందడం లేదన్నారు. వీరేష్‌స్వామి, జె.చంద్రశేఖరయ్యస్వామి, జగదీశ్వరయ్యస్వామి, పంచాక్షరిస్వామి ఉన్నారు.

రేపటి నుంచి ల్యాక్రోస్ క్రీడలు

కోసిగి : మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో రాష్ట్రస్థాయి ల్యాక్రోస్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విజేత యూత్ సభ్యులు నాగరాజు, హుసేని తెలిపారు. ఆదివారం నుంచి సీనియర్, జూనియర్ చాంపియన్ క్రీడలు చేపడతామని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడలు ఉంటాయన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శనివారం తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన బోయ రాజు 90 ఎం.ఎల్. పరిమాణం కలిగిన 288 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా సంతెకడ్లూరు బస్టాండు వద్ద పట్టుకున్నామన్నారు.